
# టెన్షన్ బాబూ టెన్షన్

కొమరవోలు సరోజ, టొరాంటో, కెనడా



నా పేరు కరినా అండి. నేను పుట్టి బుద్ధెరిగింతర్వాత మొట్టమొదటసారిగా ఇండియా ప్రయాణం పెట్టుకుంది మా అమ్మ. మా ఏడాది తమ్ముణ్ణి మా అమ్మమ్మదగ్గరుంచి నేనూ, మా అన్నయ్యా ప్రయాణం మాఅమ్మతో. మా నాన్న ఎట్లాగూ బిజీయేనయిపోయె. మా బామ్మ ముందే వెళ్ళిపోతుంది ఇండియాకి. మా పద్మజా ఆంటీ వాళ్ళ అమ్మా నాన్నా హైదరాబాదు నుంచి వచ్చారు.

"పాపా! మాతో ఇండియా వస్తావా" అని అడిగారు. నిజంగానే కాబోలని ఎగిరి గంతేశాను. సామాన్లు సర్దుకోవటం మొదలుపెట్టాక పేద్ద డైలమాలో పడిపోయానంటే నమ్మి తీరాలి మీరు.

మా బామ్మతో వెళ్ళాలా! లేక వీళ్ళతో వెళ్ళాలా! అని.

"ఎందుకే అంతహడావిడి! ఎలాగూ మనం వెళ్తున్నాంగా రెండు వారాల్లో" అంది అమ్మ తన సహజమైన మృదుమధుర స్వరంతో. నాకు కాస్త మండిన మాట నిజం. నేనేదో ఒక్క రెండు నెల్లపాటు అక్కడ వుండి వద్దామంటే ఇదొక నస. తనేమో తన కజిన్ పెళ్ళికి తన అక్కయ్యతో కలిసి టింగురంగా మంటు ఇంచక్కా ఇండియావెళ్ళి పట్టుమని పది రోజులుకూడా వుండకుండా తిరిగొచ్చేసింది. ఇప్పుడేమో మానాన్న కజిన్ పెళ్ళి. మా బామ్మేమో "నేను ఎంజాయ్ చెయ్యాలి బాబూ! ఇక్కడ అన్నింటికీ టెన్షన్ కదా! ఇండియాలో అయితే రిలాక్సవుతాను" అంటూ పెళ్ళికి ముందు రెండు నెలలూ తరువాత రెండు నెలలూ వుండేటట్లు ప్లాన్ చేసుకుంది.

"దీన్ని తీసికెళ్తే దిగులు పడితే ఎట్లా? ఏడిస్తే ఎట్లా? అమ్మ కావాలంటేనో, తమ్ముణ్ణి తీసుకురా! అన్నయ్య కావాలీ అంటే ఎట్లా? అర్థరాత్రి లేచి కూర్చుని ఏడిస్తే ఎట్లా?"

అన్నీ ధర్మసందేహాలే, నేనేమన్నా దిగులు పడతానని చెప్పానా! ఏడుస్తానని ఏవన్నా రాసిచ్చానా?

ఏం పెద్దవాళ్ళో బాబూ! అన్నీ వీళ్ళే ఊహించుకుంటారు. పద్మజా ఆంటీవాళ్ళ పేరెంట్స్ కూడా ఏం తక్కువ తిన్లేదులెండి.

ఇంకేం చెయ్యను?

మా అమ్మ మాట వినక తప్పలేదు. అసలే బక్కపిల్లని. ఇండియా ఎప్పుడెప్పుడెళ్దామా అనే ఆతృత తోటి తిండీ తిప్పలూ సరిగ్గా తినక నిద్ర సరిగ్గా పట్టక మరీ ఎంబ్రాయిడరీ దారంకంటే కూడా (అమ్మ ఏదో కుడుతుంటే చూశాలెండి) సన్నగా అయిపోయాను. లేనిపోద్ది నన్ను పిల్లల డాక్టరు దగ్గరికి తీసికెళ్ళి మరీ చిక్కి శల్యం అయిపోతున్నానని ఇండియా ప్రయాణం కేన్సిల్ చేస్తారేమోనని తెగ వర్రీ అయిపోయాను. నా అదృష్టం బాగుంది. దేవుడున్నాడు. ఆయనకు ప్రేమ నాపట్ల అనుకున్నాను.

మాఅన్నయ్యకు జ్వరం వచ్చింది. అయితేనేం 'తగ్గుతుందిలే' అని ప్రయాణం కట్టింది మాఅమ్మ.

"హమ్మయ్య" అని హాయిగా తేలికగా గుండెలనిండా ఊపిరి పీల్చుకున్నాను.

అమ్మమ్మ అంటోంది "సారీ తల్లీ, జ్వరంగా వున్న పిల్లవాణ్ణి వుంచి వెళ్ళమనటం లేదు, నావల్ల కాదని" సంజాయిషీ యిస్తున్నట్లు.

ఈ అమ్మమ్మేమిటో ఆ పప్పూ, కూరా పూరీలూ ఎప్పుడూ ఇరవై నాలుగ్గంటలూ వండమన్నా వండుతుందికానీ డ్రైవింగు రాదు, స్విమ్మింగురాదు. చివరికి ప్లేయింగ్ కార్డ్స్ ఆపటం కూడా రాదు. కష్టం బాబూ ఇట్లాంటివాళ్ళతో, అన్నయ్యను మనమే తీసికెళ్దాం అనేశాను.

"అబ్బా! ఆగవే తల్లీ కాస్సేపు. ఏం మాట్లాడుతావే పేద్ద ఆరిందాలాగా" ముద్దుగా విసుక్కుంది అమ్మ.

మా అమ్మ అలా విసుక్కుంటుంటే భలే ముద్దుగా వుంటుంది నాకు. అందుకే కాబోలు అమ్మమ్మ అట్లా చూస్తూనే వుంటుంది మాఅమ్మని అనుకున్నాను.

హైదరాబాదులో దిగామండీ, ఏయిర్ పోర్ట్ అద్భుతంగా వుంది. చిన్నబామ్మగారింటికి వెళ్ళాం.

ఆరోజే ఏదో పూజ. పెళ్ళికూతుర్ని చెయ్యటం! ఎంతబాగుందో!

ఆకుపచ్చని అరటి ఆకుల్లో అందంగా రంగురంగుల స్వీట్లు, పులిహోర, కూరలూ, అప్పడాలూ, వడియాలూను. వంటవాళ్ళు "పాపా! జాంగ్రీ తిను" "అరిసె తిను" "బొబ్బట్లు తిను" అంటూ కొసరి కొసరి వడ్డిస్తుంటే భలేగావుంది. ఎటొచ్చీ అవన్నీ తినే శక్తిలేదు కానీ, అన్నం పప్పూ కలిపి నెయ్యి వడ్డించమని అడిగి చేత్తోనే తింటుంటే... ఆ రుచీ, ఆ ఆనందం అమెరికాలో ఎప్పుడూ కలగలేదంటే అతిశయోక్తికాదు. వీటి రుచి ఏ అమెరికన్ ఫుడ్డుకి

మటుకు వస్తుందండీ!

పాపం మాఅన్నయ్యకు జ్వరం తగ్గనేలేదు. అమెరికా మందులేవీ అక్కడ పని చెయ్యలేదు. జ్వరంతో తిండిలేదు. మామూలుగానే పిట్టమెతుకులవాడు. పైగా ఇంట్లోనే పడుకుని టీవీ చూడటం. నాకు జాలిగా అనిపించింది.

పెళ్ళిరోజు ఇంకా అద్భుతంగా వుంది. నేను కూడా ఇక్కడికి వచ్చి పెళ్ళి చేసుకుంటే బాగుండుననుకున్నాను. పెళ్ళయ్యాక పెళ్ళికూతురు, పెళ్ళికొడుకు అరుంధతిని చూడటానికి కాబోలు వెళ్ళారు. నాఈడువాడే వంశీ అప్పట్నుంచీ నాకేసి చూసి ఒకటే నవ్వు... సరే దగ్గరకు వెళ్ళి నేనూ నవ్వేను పలకరింపుగా.

నా చెయ్యి పట్టుకుని చకచకా పెళ్ళిపీటల దగ్గరకు లాక్కెళ్ళి. . . . అంతకుముందు పెళ్ళికూతురి తలమీద పెళ్ళికొడుకు పోసినట్లు ఎల్లో రైస్, అదేలెండి తలంబ్రాలు వంశీ దోసిలితో తీసుకొని నాతలమీద పోశాడు. అంతటితో ఆగకుండా తనతలమీద పొయ్యమని నాచేతులు గట్టిగా లాగటం మొదలెట్టాడు. నాచెయ్యి నొప్పెట్టింది వంశీ అట్లా లాగుతుంటే. నాకైతే చచ్చే సిగ్గేసింది బాబూ! ముసిముసిగా నవ్వుతూ వంశీ చెయ్యి విదుల్చుకొని పెరిగెత్తి అమ్మకోసం వెళ్ళాను.

అమ్మా, నేనూ బాగానే షాపింగ్ చేశాము. అమ్మ నాకు నచ్చిన ఇండియన్ అవుట్‌ఫిట్లన్నీ కొన్నది. తనకూ, అమ్మమ్మకూ చీరెలు కొన్నది. చీరెలమీదకి జాకెట్లూ, చీరెలకు ఫాల్స్ కుట్టించింది. పీకో వర్క్ కూడా చేయించింది.

నాకు ఆశ్చర్యమేసిందేమిటంటే..... టైలరు ఇంటికొచ్చి ఆ బట్టలన్నీ తీసుకువెళ్ళి. . . కుట్టి మొత్తం రెండున్నరగంటలకల్లా తెచ్చేశాడు. సూపర్ డూపర్ టైలర్ అనుకున్నాను ఆ టైలరంకుల్ని చూసి.

తిరిగి వచ్చేటప్పుడు విమానంలో ఎక్కీ ఎక్కకముందే నాకు జ్వరం దంచేసింది. మా అన్నయ్యకు జ్వరం ఇంకా ఎక్కువైంది.

ఎట్లాగో కిందా మీదా పడి . . . . ప్రయాణం చేసి బఫేలో చేరుకున్నాం.

"ఏరా, ఇండియా ఎట్లా నచ్చింది?" అమ్మమ్మ అడిగింది అన్నయ్యని.

"ఐ హేటిట్" అన్నయ్య సమాధానం.

"ఎందుకనిరా?"

"నాకు జ్వరం ఎక్కువైంది... రోజుకు పదిహేడు గంటలు టీవీ చూస్తూ మందులు మింగుతూ పడుకున్నా. జన్మలో వెళ్ళనింక"

అమ్మమ్మ నోటిమీదా ముక్కుమీదా చెయ్యడ్డం పెట్టుకుని,

"నిండా ఆరేళ్ళు లేవు వెధవకి, జన్మలో వెళ్ళడట జన్మలో" అని సాగతీసుకుంటూ మధ్యమధ్యలో కిసుక్కున నవ్వటం.

నన్నడగనే లేదు అమ్మమ్మ. అయినా నేనే ఆగలేక చెప్పేశా.

"మళ్ళీ తొందరలో వెళ్ళి చూస్తాను. నాకు భలేగా నచ్చింది" అని.

"అమ్మాయ్ ఇది మాఅమ్మేమోనే! నిన్ను మూడేళ్ళు నిండేదాకా పెంచినప్రేమ. చనిపోయేముందు కూడా నీ చిన్నపిల్ల పేరేంటమ్మా అంటే శిరీష అంది. నాపేరూ, నన్నే మర్చేపోయింది. దీన్ని మావూరు తీసికెళ్తే మా ఇల్లూ, తోటా సపోటాచెట్లు, బాదాం చెట్లు, కొబ్బరిచెట్లూ ఆ పరిసరాలన్నీ చూస్తే ఏవన్నా గతజన్మ గుర్తుకొచ్చేదేమో!".

అమ్మమ్మ మాటలు నాకు కొంత అర్థం అయి కాకుండా వున్నాయి.

అర్థం అయిందల్లా ఈసారి అమ్మమ్మ వాళ్ళ వూరువెళ్ళి ఆ ఇల్లూ, వాకిలీ చూడాలని. సెప్టెంబరు వచ్చేసింది. నేను ప్రీ స్కూలుకి, అన్నయ్య స్కూలికి మాతమ్ముడు డేకేర్ కి వెళ్ళివస్తున్నాం. పాపం అమ్మకి ఎన్ని పన్లో!

మమ్మల్ని దింపటం, పికప్‌లు, స్విమ్మింగులు, కరాటేలు, సంగీతం, సంఖ్య, డాన్స్.

ఒక్క పెన్నీ ఇన్ కమ్ వుందోలేదో కానీ క్షణం తీరికేలేదు.

ఇండియాలో వాళ్ళందరూ ఎంత రిలాక్సుడుగా వున్నారో కదా!

'మనం మూవ్ అవుదాం' ఇండియాకి ఇంచక్కా అంటే అమ్మానాన్నా నవ్వుకుంటున్నారేగానీ జవాబిస్తేగా!

వీకెండ్సుకి చుట్టాలు, స్నేహితులు మధ్యమధ్య మా అమ్మమ్మా తాతల ఫ్రెండ్స్ ప్రతివాళ్ళూ వచ్చినప్పుడల్లా ఏదో టెన్షనూ, స్ట్రెస్సూ అని ఒకటే పెద్ద టాపిక్.

"గ్రీన్ కార్డ్ రాలేదింకా" అని ఒకరు, "హెచ్ వన్" కంటిన్యూ అవదట అని మరొకరు, పిల్లలు 'మెడిసిన్' చదవటంలేదని ఇంకొకరు.

టెన్షనో టెన్షన్ అని, ఏడుపొక్కటే తక్కువనుకోండి. అయితే నాకర్థంకానిదేమిటంటే నాటెన్షన్ గురించి ఎవ్వరూ ఆలోచించరేం? తెల్లవారిలేస్తే నాతో ఎవరాడుకుంటారు?

తమ్ముడు అమ్మను గట్టిగా కావలించుకొని నన్ను దగ్గరికి రానియ్యటంలేదు. అన్నయ్య స్నేహితులు నన్నేమో చిన్నపిల్ల చిన్నపిల్ల అని ఇగ్నోర్ చేస్తున్నారు. మాతమ్ముడికి డైపర్ మారుస్తానంటే 'నీకు చేతకాదే' అని అదీ చెయ్యనివ్వరు. నా అంతట నేను ఎక్కడికీ వెళ్ళలేను. అన్నిటికీ అమ్మమీదా నాన్నమీదా ఆధారపడాలి.

హాయిగా కూర్చొకుండా ఆ కారుసీటొకటి నన్ను కట్టిపడెయ్యడానికి. చూడండి నాకెన్ని టెన్షన్లో? ఒక్కరు కూడా ఆలోచించరు నా టెన్షన్ గురించి. మాఅమ్మ ఒకర్తే నన్నర్థం చేసుకునేది. వాళ్ళందరి టెన్షన్‌ల గురించి వినీవినీ నాకు మరింత టెన్షన్ పెరిగిపోయింది.

"కరీనా ఐ డోంట్ నో వాట్ ఐ విల్ డు విత్ అవుట్ యు" అన్న మాఅమ్మ తియ్యని సాఫ్ట్ లాలింపుతో టెన్షన్ సంగతి తాత్కాలికంగా మరచిపోయి, మ్యాట్రిన్ ప్రభావమనుకుంటా. . . ఆదమరచి అమ్మఒడిలో గువ్వలా ఒదిగి నిద్రలోకి జారిపోయాను. నిద్రలేచాక మళ్ళీ ఇండియా కబుర్లు చెప్తాలెండి. ఉండనా మరి. . . బై.